రిజర్వేషన్ల చట్టబద్ధతకు నాయకత్వం వహిస్తా

- అవసరమైతే రాజ్యాంగ సవరణ కోసం కొట్లాడుదాం
- ప్రధాని అపాయింట్‌మెంట్ ఇప్పించండి
- కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు సిఎం విజ్ఞప్తి
- రాహుల్‌ను కలిసి విన్నవిద్దామంటూ సూచన
- కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్న రేవంత్ రెడ్డి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బిసి రిజర్వేషన్ బిల్లుల చట్టబద్ధత కోసం జరిగే ఉద్యమానికి ఢిల్లీలో నేనే నాయకత్వం వహిస్తా. రాజకీయాలకతీతంగా బీఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం, సిపిఐ పక్షాలు బీసీ బిల్లుకు శాసనసభలో సంపూర్ణ మద్దతు ప్రకటించడం హర్షణీయం...తమిళనాడు తరహాలో యావత్ తెలంగాణ ఒక్కటై కేంద్రంపై ఒత్తిడి తెద్దాం. అవసరమైతే రాజ్యాంగ సవరణకు పార్లమెంట్‌లో కొట్లాడుదాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ శాసనసభలో సోమవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రెండు వేర్వేరు బిల్లులపై సీఎం మాట్లాడారు. ఢిల్లీలో దీన్ని పట్టాలెక్కించే భాద్యతను నేనే తీసుకుంటానని స్పష్టం చేశారు. అందుకు బీజేపీ నేతలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రధాని అపాయిమెంట్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. "రాహుల్ గాంధీని కలిసి పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించాలని కోరుదాం. వారి సమయం తీసుకునే బాధ్యతను మా పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌కు అప్పగిస్తున్నా. అవసరమైతే రాజ్యాంగ సవరణ కోసం కొట్లాడుదాం. ఇప్పటి వరకు వంద సార్లకు పైగా రాజ్యాంగ సవరణ జరిగింది. దేశంలో కుల గణన సర్వే 1931లో జరిగింది. ఆ తర్వాత మండల్ కమిషన్ సిఫారసుల ఆధారంగా బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. బిసి బిల్లును పార్లమెంటులో ఆమోదించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది వారికి 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదు" అని సీఎం పేర్కొన్నారు. 2017లో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసిలకు 37 శాతం రిజర్వేషన్లు కలించాలని శాసన సభ తీర్మానం చేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించిందని గుర్తు చేశారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా ఆ తీర్మానాన్ని ఉప సంహరించుకుంటున్నామని సీఎం తెలిపారు.

కామరెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉంది.

రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు తాము కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించామని సీఎం తెలిపారు. ఆ క్రమంలో ఆయా వర్గాల రిజర్వేషన్లను పెంచేందుకు కులగణన చేపట్టి విజయవంతంగా పూర్తి చేసినట్టు వివరించారు. "దేశంలోనే మొదటి సారిగా తెలంగాణలో సర్వే పారదర్శకంగా జరిగింది .రెండు దఫాల్లో చేపట్టిన సర్వేలో 3,55,50,759 మంది వివరాలు అందించారు. అందులో బీసీల సంఖ్య 56.36 శాతంగా తేలింది. సభా నాయకుడిగా అసెంబ్లీలో నేను మాట ఇస్తున్నా. సర్వేలో పొందుపరిచిన బీసీల లెక్క వందశాతం సరైంది. 2024 ఫిబ్రవరి నాలుగున సర్వే మొదలు పెట్టి 2025 ఫిబ్రవరి నాలుగన పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి నాలుగును సోషల్ జస్టిస్‌డేగా సభ ద్వారా తీర్మానించి నిర్ణయించాం. కులసర్వేలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. తెలంగాణ సమాజం బలహీన వర్గాల రిజర్వేషన్ల విషయంలో ఏకాభిప్రాయంతో ఉన్నారనే సందేశం ఈ సభ ద్వారా పంపించాలనుకున్నాం. ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. శాసన సభలో ప్రతిపక్ష నేత కెసిఆర్‌తో పాటు అన్ని పార్టీలు మాతో కలిసి రావాలి" అని సీఎం విజ్ఞప్తి చేశారు.

మంత్రులను తొలగిస్తేనే పట్టున్నట్టా...?

- ఇది పార్టీ పథకం కాదు.. ప్రజల పథకం...
- జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటన : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

" పరిపాలనపై పట్టు లేదంటూ కొందరు కామెంట్లు చేస్తున్నారు, గత సీఎంల మాదిరిగా క్యాబినెట్ నుంచి మంత్రులను తొలగిస్తేనే పట్టున్నట్టా? అధికారులను తొలగించి, బదిలీలు చేస్తేనే పాలనపై పట్టు సాధించినట్టా?... " అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అన్నింటినీ సవ్యంగా సరిదిద్దుకుంటూ ముందుకు వెళ్లడమే తన విధానమని ఆయన స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకం కలిగించడమే తన లక్ష్యమని తెలిపారు. ఎలాంటి ఆరోపణలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమల్లో పారదర్శకంగా వ్యవహరించాలంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను, అసలైన అర్హులకే పథకాలను వర్తింపజేయాలంటూ అధికారులను ఆదేశించామని వివరించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి పథకాలు, అందుకనుగుణంగా ఆర్థికం సాయం చేసేందుకు రూపొందించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని సోమవారం శాసనసభ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఏర్పాటైన తొలి ఏడాదిలోనే 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలును భర్తీ చేశామని చెప్పారు. తొలి ఏడాదిలోనే ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చిన రాష్ట్రం మరొకటి లేదన్నారు. రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న 65 లక్షల మంది మహిళలకు త్వరలోనే 1.20 కోట్ల నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. ఈ రకంగా రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ అసెంబ్లీలో బిల్లును కూడా ప్రవేశపెట్టామని అన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం 35 ఏళ్ల గా ఉద్యమం సాగుతోందనీ, దశాబ్దాలుగా నానుతున్న ఈ సమస్యపై కూడా అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టామని తెలిపారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి, దుబారా జరిగాయని విమర్శించారు. ఈ క్రమంలో దుబారాను, ఖర్చునూ తగ్గించుకుంటూ అప్పులను చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. ఇతర రంగాలతో పోలిస్తే ఒక్క ఇసుక విక్రయంలోనే రోజువారీ ఆదాయం రూ.మూడు కోట్లు పెరిగిందనీ, జిఎస్‌టి వసూళ్లలో 17 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్‌గా ఉందని సీఎం వ్యాఖ్యానించారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే స్వయం ఉపాధి కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ పథకాన్ని ఉపయోగించుకోవాలంటూ నిరుద్యోగ యువతకు ఆయన సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించి, ఫలితాలను కూడా విడుదల చేశామని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఒకప్పుడు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ధర్నాలు జరిగేవనీ, ఇప్పుడు ఒక నోటిఫికేషన్‌కు మరో నోటిఫికేషన్‌కు మధ్య గ్యాప్ ఇవ్వాలంటూ నిరుద్యోగులు కోరుతున్నారని తెలిపారు.

గోదావరి చెలమ నీరే పేదలకు తాగునీరు

- కటిక చీకటిలో మగ్గుతున్న ఆదివాసీలు
- వారి సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పట్టవా?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు, మద్దతుగా సిపిఎం నాయకులుు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదలకు గుక్కెడు మంచినీళ్లు ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నదనీ, కారుచీకట్లో ఆదివాసీల జీవితాలు మగ్గుతున్నా కనీసం వారికి విద్యుత్ సౌకర్యం కల్పించలేని స్థితిలో అధికారులున్నారని సిపిఎం రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం మండపాకలో నివాసం ఉంటున్న ఆదివాసీలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, తదితర సౌకర్యాలు కల్పించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. మండపాకలో ఆదివాసీలు, గుడిసెవాసులు ఉదయం ఏడు గంటలకు ర్యాలీ ప్రారంభించగా, పాదయాత్ర చేసుకుంటూ మధ్యాహ్నం 12 వరకు ఏటూరునాగారం ఐటీడీఏకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ధర్నాలో వీరయ్య మాట్లాడుతూ.. పేదలు గుక్కెడు మంచినీళ్ల కోసం 20 కి.మీ నడవాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు. మండల కేంద్రానికి 2 కి.మీ దూరంలో ఉన్న ఆదివాసులు, పేదలకు చెలమనీరే దిక్కయిందని అన్నారు.కనీసం గ్రామపంచాయతీ పాలకమండలి నుంచి మంచినీటి సౌకర్యం కల్పించాల్సి ఉన్నా అధికారులూ పట్టించుకోలేదని ఆరోపించారు. పేదలు రెండేండ్లుగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటుంటే వారి సమస్యలు పట్టించుకోకపోగా ఖాళీ చేయాలని ఒత్తిడి చేయటం ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనమని అన్నారు. పేదల సమస్యలపై ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి జాగా లేక, ఇల్లు లేక పేదలు రోడ్డెక్కి పోరాటం చేస్తుంటే రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు గాడిద పళ్లు తోముతున్నారా అంటూ ఎద్దేవా చేశారు. వాజేడులోని ఆదివాసులకు నీళ్లు లేక అల్లాడుతుంటే వీళ్ల సమస్యలు బీజేపీకి కనబడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కండ్లు తెరిచి పేదలు, ఆదివాసులకు కనీస అవసరాలైన ఇల్లు, ఇంటిజాగా, తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజీ, రోడ్లు లాంటి ఇతర సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ మాట్లాడుతూ.. పేదలు, ఇంటి జాగ కోసం ఏడాదిగా పోరాటం కొనసాగిస్తున్నారని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. ఐటీడీఏ పీవో సమస్యలకు పరిష్కారం చూపకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐటీడీఏ పీఓకు వినతిపత్రం ఇచ్చారు. దీనిపై పీఓ స్పందిస్తూ.. అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామపంచాయతీ అధికారులతో మాట్లాడి ప్రతి రోజూ ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించేలా చర్యలు చేపడతామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ దావూద్, పొదిళ్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, గొంది రాజేష్, జజ్జరి దామోదర్, గుగ్గిళ్ళ దేవయ్య, బచ్చల కృష్ణ, బాబు పూణెం కృష్ణ, బాబు బత్తుల సంతోష్, నరేష్, గౌరారపు చంద్రశేఖర్, తోలే ముత్తయ్య, తల్లడి ఉదయ, పాయంకుమారి, శాంత కుమారి, రామలక్ష్మి, శారద, కురసం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణమస్తు' ప్రారంభించలేదు

- కల్యాణలక్ష్మిని కొనసాగిస్తున్నాం : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కల్యాణమస్తు పథకాన్ని ఇంకా ప్రారంభించలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగిస్తున్నామని వివరించారు. సోమవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో బిఆర్‌ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ కల్యాణమస్తు పథకాన్ని ప్రారంభిస్తామంటూ ఎన్నికల్లో హామీ ఇచ్చామని గుర్తు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికీ తెలుసనీ అందుకే ఇంఆ ప్రారంభించలేదని అన్నారు. ఆదాయాన్ని పెంచే మార్గం ఉంటే చెప్పాలని కవితను మంత్రి కోరారు. కల్యాణలక్ష్మి పథకానికి సంబంధించి బిఆర్‌ఎస్ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను తాము ఇస్తున్నామనీ, దానికి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు.

మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ : కవిత

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీఆర్‌ఎస్ సభ్యులు కల్వకుంట్ల కవిత విమర్శించారు. రూ.లక్ష నగదుతోపాటు తులం బంగారం ఇస్తామంటూ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక ఆ హామీని విస్మరించిందని అన్నారు. మహిళలకు పెండ్లి సమయంలో తులం బంగారం ఇవ్వకుండా ఈ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కళ్యాణమస్తు పథకాన్ని ఎప్పుడు ప్రారంభిస్తారో కూడా సమాధానం చెప్పడం లేదని అన్నారు. 2023, డిసెంబర్ నుంచి పెండ్లి అయిన మహిళలకు తులం బంగారం తర్వాత రీయింబర్స్ చేస్తారా?అని ప్రశ్నించారు. కానీ ప్రభుత్వ సమాధానం నిరాశాజనకంగా ఉందన్నారు. మహిళలకు రూ.2,500 ఇస్తామన్న హామీ కూడా అమలయ్యే అవకాశం లేదని చెప్పారు.

ఒక్క ఛాయాచిత్రం వెయ్యి పదాలకు సమానం

- ప్రజాస్వామ్య పరిరక్షకులు ఫొటో జర్నలిస్టులు
- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

జర్నలిస్టుకు అవార్డు అందజేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఒక్క ఛాయాచిత్రం వెయ్యి పదాలకు సమానం. ప్రజల బాధలను, భావోద్వేగాలను ఫొటోలు ప్రతిబింబిస్తాయి. నేడున్న సామాజిక పరిస్థితుల్లో ఫొటో జర్నలిస్టులు ప్రజాస్వామ్య పరిరక్షకులు. సమాజంలో వారి పాత్ర కీలకం" అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రింట్ మీడియాకు ఆదరణ తగ్గుతున్న ప్రస్తుత తరుణంలో వారు నిర్వహిస్తున్న పాత్ర మరువ లేనిదని కొనియాడారు. వార్త కథనాల కన్నా ఒక్క ఫోటో ఆ పత్రిక నాణ్యతను తెలియ జేస్తుందని అభిప్రాయపడ్డారు. గతానికి, భవిష్యత్‌కు వారధిగా ఫొటోలు పని చేస్తాయని పేర్కొన్నారు. ఫొటోగ్రఫీలో తెలంగాణ, త్రిపుర రాష్ట్రాలకు గొప్ప చరిత్ర ఉందని గవర్నర్ అన్నారు. దేశంలోనే మొదటి సారీగా 1880లో ప్రయివేట్‌గా ఫొటో కెమెరాలు కొనుగోలు చేసిన ఘనత హైదరాబాద్, త్రిపుర సంస్థానాలకే దక్కిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టులు రాజకీయాలకతీతంగా విలువలు పాటిస్తూ వృత్తిలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మెన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కాలగర్భంలో కలిసి పోయిన చరిత్రను గుర్తు చేసేవి ఫొటోలని అన్నారు. రాష్ట్రంలోని ఫొటో జర్నలిస్టులు అన్యాయాలు, అవినీతి, అక్రమాలను తమ ఫొటోల ద్వారా సమాజానికి చేరవేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కెఎన్.హరి స్వాగతోపన్యాసం చేసిన ఈ కార్యక్రమంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, ఆల్ ఇండియా రైస్ మిల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తూడి దేవేందర్ రెడ్డి, రా అండ్ వెడ్డింగ్ సినిమా అధినేత రఘునాథ్, ఆర్విఆర్ మాభూమి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్, యూరోనిక్స్ కంపెనీ తెలంగాణ డీజీఎం మహమ్మద్ సిద్ధికి, టీయూడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రాంనారాయణ, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ స్థాయి కాదు మీది రేవంత్‌రెడ్డి..

- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, కెటిఆర్, హారీశ్‌రావు స్థాయి మీది కాదు రేవంత్ రెడ్డి.. మీ స్థాయి కౌశిక్‌రెడ్డి స్థాయి మాత్రమేనని బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. స్టేషన్ ఘన్‌పూర్ సభలో సీఎం నోటికి వచ్చినట్టు మాట్లాడారని, నిస్సిగ్గుగా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చానని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. దమ్ముంటే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి సెక్యూరిటీ లేకుండా అశోక్‌నగర్‌కు రావాలన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని, డిసెంబర్ వరకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని.. ఎందుకు ఇప్పటివరకు ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ 2 లక్షల 10 వేల ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ అయిందని భట్టి విక్రమార్క చెబుతున్నారు.. తన నియోజకవర్గంలో 100 శాతం రుణ మాఫీ అయితే, తాను రాజీనామా చేస్తానన్నారు. స్టేషన్ ఘన్‌పూర్‌లో అభివృద్ధి కోసం పార్టీ మారినా అని కడియం అంటున్నారు.. మరి ఎంపీగా ఉన్న కడియం కూతురు అభివృద్ధి కోసం బీజేపీలోకి ఎందుకు మారలేదని ప్రశ్నించారు. చావు నోట్లో తలబెట్టి తెలంగాణ సాధించింది కేసీఆర్ అని, తెలంగాణ జాతి పిత కేసీఆరే అని అన్నారు.

చారిత్రాత్మక నిర్ణయం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, ప్రతిపక్షాలు బీసీ బిల్లుకు సహకరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకరయ్య, శ్రీహరి ముదిరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా సభలో బిసి రిజర్వేషన్ల పెంపు బిల్లును ప్రవేశపెట్టామన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా, విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ అందించే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకరయ్య మాట్లాడుతూ.. ఎన్నికల్లో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు కుల గణన చేశామని, కేంద్ర ప్రభుత్వమూ చట్ట సవరణకు సహకరించాలన్నారు. ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్ ఇప్పటికీ బీసీలోని పలు కులాలు చట్ట సభలలోకి రాని పరిస్థితి ఉందని, చేతులు ఎత్తి మొక్కుతున్న.. ప్రతిపక్షాలు ఈ బిల్లుకు సహకరించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు 2వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P.No. 21/ 2023
O.S.No. 2/2012
Kona Subba Rao, S/o Subbarayudu, aged 46 years, Hindu, R/o at Badvel Road, Mydukur Town, Kadapa Dist. ...Petitioner/D.Hr.
Vs
Bayee@ Chenchu Vijaya Lakshmi, W/o Sundaraiah, aged 48 years, Hindu, R/o D.No.14/1/89/2/1/2, Lakshmi Nagar, New Allampur, Borabanda, Hyderabad, T.S. ...Respondent/J.Dr.
నోటీసు
ఈ నెంబరు E.P.ని Petitioner/D.Hr., Respondent/J.Dr. అయిన మీ పైన రాజశ్రీ కోర్టు నందు దాఖలు చేసినారు. అట్టి E.P.లో Respondent/ J.Dr అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమేమనగా, మీరు హాజరు అగుటకు గాను 09.04.2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటున్నది. పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైనా ఆక్షేపనలు ఉన్న యెడల మీరు గాని, మీ వకీలు ద్వారా గాని తెలుపవలెను. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.
వాయిదా తేది:09.04.2025
//By Order of the Court//
B.C.MADAIAH
Advocate,
PRODDATUR.

IndiaShelter Home Loans
ఇండియా షెల్టర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
స్థిరాస్తి అమ్మకం కొరకు విక్రయ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (ఇకపై "ది రూల్స్" గా సూచించబడుతుంది) యొక్క రూల్ 9(1) తో చదువుతూసెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ ఫైనాన్సియల్స్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (ఇకపై "ది యాక్ట్" గా సూచించబడుతుంది) క్రింద స్థిర అసెట్స్ అమ్మకం కొరకు వేలం విక్రయ నోటీసు సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు), సహ-రుణగ్రహీత/లు మరియు హామీదారు(లు) లేదా వారి చట్టపరమైన వారసుడు/ప్రతినిధులకు ప్రకటన ఇవ్వడమేమగా దిగువ వివరించిన స్థిరాస్తి/లు ఇండియా షెల్టర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఇకపై "సెక్యూర్డ్ క్రెడిటార్"గా సూచించబడుతుంది) ప్లాట్ నం.15, 6వ అంతస్తు, సెక్టార్-44, ఇండస్ట్రియల్ ఏరియా, గురుగ్రామ్, హర్యాణ-122002 వద్ద ఉన్న దీని నమోదిత కార్యాలయం మరియు శాఖా కార్యాలయం : ఎసిఐ కృష్ణ ఆర్కెడ్ హౌ.నం.5-5-116/302ఎ, 3వ అంతస్తు, గణేష్ నగర్, వనస్థలిపురం, హైదరాబాద్-500070 యొక్క అధీకృత అధికారి ద్వారా స్వాధీనం చేసుకున్న స్థిరాస్తి తనఖా పెట్టినట్లు/ఛార్జ్ చేయబడినవి, దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు లేదా హామీదారుల నుండి సెక్యూర్డ్ క్రెడిటార్‌కు రావల్సిన బకాయి మొత్తం యొక్క రియలైజేషన్ కొరకు దిగువ పేర్కొన్న తేదిలపై రికవరీ కొరకు "ఎక్కడ ఉన్నది", ' 'ఉన్నది ఉన్నట్లుగా" మరియు "అక్కడ అలాగే " ప్రాతిపదికన విక్రయించబడుతుంది. దిగువ పేర్కొన్న ప్రదేశం వద్ద అధీకృత అధికారి ద్వారా విక్రయం నిర్వహించబడుతుంది.

లోన్ అకౌంట్ నం./ఎపి నంబరు మరియు రుణగ్రహీత(లు)/ సహ-రుణగ్రహీత(లు)/ హామీదారు(లు) పేరు	సెక్షన్ 13(2)క్రింద డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్థిరాస్తి/ సెక్యూర్డ్ అసెట్ వివరణ	స్వాధీనతా తేది మరియు విధానం	రిజర్వ్ ధర	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం
HLVPCHLONS000005096494/AP ----10228125 1) శ్రీ/శ్రీమతి. అసూరి యాదమ్మ 2) శ్రీ/శ్రీమతి. అరి మహేందర్	11-అక్టోబరు-2024, రూ.11,14,055/- (పదకొండు లక్షల పద్నాలుగు వేల యాభై ఐదు రూపాయలు మాత్రమే) బిడ్ పెంపుదల మొత్తం :రూ.50,000/-	నల్గొండ రిజిస్ట్రేషన్ జిల్లా మరియు చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ ఉపజిల్లా క్రింద, యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్, ఎమ్.పి. చౌటుప్పల్ దేవలమ్మ నగరం, గ్రామ పంచాయతీ క్రింద, యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, దేవలమ్మ నగరం గ్రామం వద్ద ఉన్న ఆ ఇంటి బేరింగ్ నం.4-58, మూల్యాంకనం నం.320737000607 బ్రిక్ వాల్స్ నిర్మాణంతో మరియు బి.టి.ఎస్.రూఫ్ బిల్డప్ ఏరియా 620.0 చ.అ.లు. గ్రౌండ్ ఫ్లోర్, మొత్తం ఏరియా తో పాటు బిల్డప్ ఏరియా మరియు ఓపెన్ ప్రదేశాలు : 169.00 చ.గ.లు. లేదా దీనికి సమానమైన 141.28 చ.మీ.లు. మరియు హద్దులు : సరిహద్దులు : తూర్పు : అసూరి పద్మ ఓపెన్ ప్రదేశం, పడమర : 10-0" వెడల్పు రోడ్డు, ఉత్తరం : బొమ్మ పెంటయ్య ఇల్లు, దక్షిణం : 3-0" వెడల్పు లాన్ మరియు తర్వాత బొమ్మ ఇల్లు) దుర్గయ్య.	08.03.2025, భౌతికం తేది నాటికి మొత్తం బకాయి రూ. 12,42,224.12/- తేది : 12.03.2025	రూ. 13,32,900/- బయానా మొత్తం (ఇఎమ్‌డి) రూ. 1,33,290/-	04.04.2025 ఇఎమ్‌డి డిపోసిషన్ చివరి తేది 07 ఏప్రిల్, 2025 వేలం తేది మరియు సమయం 8 ఏప్రిల్ 2025, ఉ.11.00గం.
LAHYVLLONS000005066002/AP-10157231 1) శ్రీ/శ్రీమతి. బోసుపల్లి నాగమణి, 2. శ్రీ/శ్రీమతి. కృష్ణ బోసుపల్లి	11-అక్టోబరు-2024 రూ.15,30,195/- (పదిహేను లక్షల ముప్పై వేల ఒకవందా తొంభైఐదు రూపాయలు మాత్రమే) బిడ్ పెంపుదల మొత్తం: రూ.50,000/-	ఆర్.ఆర్.జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం రెవెన్యూ మండలం, బగయత్ ఇబ్రహీంపట్నం గ్రామం యొక్క షెరిగూడ వద్ద ఉన్న గ్రామకంఠంలో ఇంటి బేరింగ్ నం.4-34 (పిటిఐఎన్ నం.1178001323)కు ప్రకారం ఆ టైటిల్ పేపర్ల కన్‌ఫర్మ్ కొలత 133.0 చ.గ.లు., ఉన్న ప్లింత్ ఏరియా 670 చ.అ.లు. (170 చ.అ.లు., తో ఆర్.సి.సి. రూఫ్ మరియు 500 చ.అ.లు.తో ఎ.సి.సి. షీట్స్) మరియు హద్దులు : సరిహద్దులు : ఉత్తరం : రోడ్డు మరియు ఎన్.శేఖర్ ఇల్లు, దక్షిణం : బి.యాదయ్య ఇల్లు, తూర్పు రోడ్డు మరియు ఎన్.ఈశ్వర్ ఇల్లు, పడమర : బి.రాములు ఇల్లు.	07.03.2025 భౌతికం తేది నాటికి మొత్తం బకాయి రూ. 16,55,158.54/- తేది : 12.03.2025	రూ. 18,00,000/-, బయానా మొత్తం (ఇఎమ్‌డి) రూ. 1,80,000/-	04.04.2025 ఇఎమ్‌డి డిపాజిషన్ చివరి తేది : 07 ఏప్రిల్, 2025 వేలం తేది మరియు సమయం : 8 ఏప్రిల్, 2025, ఉ.11.00గం.

ఇఎమ్‌డి డిపాజిషన్ ప్రదేశం మరియు వేలం ప్రదేశం : ఎసిఐ కృష్ణ ఆర్కెడ్ హౌ.నం.5-5-1166/302ఎ, 3వ అంతస్తు, గణేష్ నగర్, వనస్థలిపురం, హైదరాబాద్ 500070,
చెల్లింపు మోడ్ : ఇండియా షెల్టర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కి అనుకూలంగా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా మోడ్ అన్నీ చెల్లింపులు జరుపవచ్చును.
సంప్రదించాల్సిన అధీకృత అధికారి : శ్రీ.మందల రమేష్, మొ.నం.+91 9908062299 లేదా శ్రీ.ఆనంద్‌బాబు గౌడ్ +91 9866563333.

IN THE COURT OF THE HON'BLE CHAIRMAN MACT CUM XIV ADDI CHIEF JUDGECOURT , CITY CIVIL CORT AT: HYDERABAD
MVOP. NO.1744 OF 2024
Between
Bhamidipalli Surya Sai Abhiram. ...Petitioner
And
Srinu Sirassi and Others. ...Respondents
To,
1. Venkateswarlu Golla,C/o.S.Srinu , Manjeera Nagar, Beeramguda, Ameenpur, Sangareddy ,Medak District. ...R3
Please take Notice that the above named Petitioner filed above O P against you and other for Compensation, Praying that the Hon'ble court for grant of compensation in favor of the petitioner. The Hon'ble Court posted the above case on**15-4-2025.**at **10.30** am for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
(BY ORDER OF COURT)
M/s.C.Gouri Shanker
M/s.V.Srinivas,
Advocate
20/2RT,MCH,Colony,Malakpet, Hyderabad.

IN THE COURT OF HON`BLE IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURTS AT: HYDERABAD
I.A. No. 36 OF 2025
IN
O.S. .No. 138 OF 2025
Between
Dr. B.Gopi ...Petitioner/Plaintiff
AND
M. Kanaka Raju@Neel Raju and another ....Respondents/Defendants
NOTICE
To
Respondent No.2/Defendant No.2
Raghu @Raghu Sagar S/o. Not Known Aged about 35years, Occ: You tuber cum Reporter O/o. Mana Toli velugu, CFRC+C7R. Post Office Road, Prakashnagar Begumpet,Hyderabad -16
Please take notice that the petitioner/plaintiff filed above suit for Perpetual Injunction along with I.A.for temporary injunction against the respondents/defendants and the Hon'ble court was pleased order substitute of Notice/Summons to respondent No.2/defendant No.2 in the above case to appear before the court on 01-04-2025 at 10:30hrs without fail.
//BY ORDER OF THE COURT//
V.Raghava Reddy
P.Nagaraju
Advocates
(M): 9347071007
Counsels for Petitioner/Plaintiff

PUBLIC NOTICE
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, VISAKAPATNAM DISTRICT AT: YELLAMANCHILLI
O.S.No. 17 OF 2024
BETWEEN:
1. Ashish Jain S/o. Late P.Ramesh Kumar Jain, A/a. 34 yrs, Occ: Business,
2. Akash Jain S/o. Late P.Ramesh Kumar Jain, A/a. 29 yrs, Occ: Business,
Both No.1 and 2 are R/o.H.No.12-1-334/17/18, Lalapet, Secunderabad, T.S-500017. ...Plaintiffs
AND
1. Mr.K.Sunder Babu S/o. Deva Danam, A/a. 56 yrs, Occ: Business, R/o. 12-1-334/17/2/1, Asian Hospital Lane, Lalapet, Hyderabad, T.S-500017.
2. Mr.K.Deva Kiran Kumar S/o. Late K.Dhanraj, A/a. 41 yrs, Occ: Railway Employee, R/o. H.No.12-1-334/19, Lalapet, Hyderabad, T.S-500017. ...Defendants
Please take notice,
In the above matter, plaintiffs filed the Suit vide O.S.No.17/2024 on the file of Senior Civil Judge, Vishakapatnam District, At: Yellamanchilli for Recovery of money against the Defendants and along with I.A.No.209/2024 and I.A.No.210/2024. The matter is posted on **04-04-2025** for the appearance of the Defendant No.1 and if any interested persons for calling the objections. Hence, this notice.
//BY ORDER OF COURT//
H.VANITHA JAIN
ADVOCATE
#O/a. 1st Floor, H.No.1-1-27/2, Raja Rajeshwari Nagar, Kapra, Medchal-Malkajgiri District-500062.
Cell No.9030330551/7897891005

మహారాజశ్రీ నందిగామ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO.191/2023 IN.OS NO.61/2018
Between:-
1. శ్రీమతి. ఆషా
2. శ్రీమతి పరసాలక్ష్మీ రాజేశ్వరి- పిటిషినర్ ...వాదులు
-మరియు-
1. పరసా శ్రీనివాసరావు- రెస్పాండెంట్/మొదటి ...ప్రతివాది
2. పారా భారతి
3. నరుకుల్ల రమాదేవి- రెస్పాండెంట్స్/ ...ప్రతివాదులు
4.వణుకూరి అరుణ 2 నుండి 4
3వ రెస్పాండెంట్/ 3వ ప్రపోజ్డ్ ప్రతివాదికి నరుకుల్ల రమాదేవి అలియాస్ చిన్నమ్మాయి, భర్త. నరసింహారావు, హౌ.నం.7-9-44/21 S.R. రామ్ నగర్, పానగల్ రోడ్, నల్లగొండ టౌన్, నల్లగొండ జిల్లా, తెలంగాణ.
పై 3 రెస్పాండెంట్/ 3వ ప్రపోజ్డ్ ప్రతివాదిని పై నంబర్ పిటిషన్‌లో మిమ్మలను 3వ ప్రతివాదిగా చేర్చుటకు శ్రీ కోర్టులో దాఖలు చేసి ఉన్నందున శ్రీ కోర్టువారు మీకు ది.**27-03-2025** వ తేదిన వాయిదా ఇచ్చివున్నారు. సదరు తేదిన ఉదయం గం॥**10.30** ని॥లకు మీరు స్వయముగా గానీ, మీ ప్లీడరు వారి ద్వారా గానీ హాజరయిన సదరు పిటిషిన్‌లో మీ అభ్యంతరాలను కౌంటర్‌గా దాఖలు చేయుగలందులకు వాయిదా ఇచ్చివున్నారు. మీరు వాయిదాకు హాజరు కాక తప్పిన యెడల మీ పై శ్రీ కోర్టువారు పరోక్షముగా పిటిషన్ ఆర్డర్ తీర్మాణం చేయదురు అని మీకు తెలియజేయడమైనది.
(I.A.No. 191/2025, OS-61/2018 తేది 27.1.2025 ప్రకారం ఇవ్వబడినది) వాయిదా 27.03.2025
ఇట్లు
గోబేరు శివరామకృష్ణ
అడ్వకేట్ AP/288/1997
రెవెన్యూ కాలనీ, నందిగామ-521185
ఎన్.టి.ఆర్.జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్ నం.9866723742
నందిగామ
ది. 15.03.2025

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ విధానం

- నిషేధిత జాబితాలోని గజం స్థలం రిజిస్ట్రేషన్ చేసినా కఠిన చర్యలు
- ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలకు సమర్థవంతంగా, సులువుగా, పారదర్శకంగా అవినీతి రహితంగా మరింత మెరుగైన సేవలు అందించేలా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్‌తో పాటు బయోమెట్రిక్ విధానాన్ని తీసుకురాబోతున్నామని రెవెన్యూ ,హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

సోమవారం సచివాలయంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రాషన్ శాఖపై దాదాపు మూడు గంటల పాటు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సెక్రెటరీ జ్యోతి బుద్ధప్రకాష్, సిసిఎల్ఎ సెక్రటరీ మంధా మకరంద్, ఐటి సెక్రటరీ బావేష్, ఆరు జోన్ల డిఐజీలు, ఉమ్మడి జిల్లాల జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఒక డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కు కనీసం 45 నిముషాల నుంచి గంటకుపైగా సమయం పడుతుందని, ఈ స్లాట్ బుకింగ్ విధానం ద్వారా పది నుంచి 15 నిముషాలలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. ఈ స్లాట్‌బుకింగ్ విధానాన్ని ఏప్రిల్ మొదటి వారంలో పైలట్ ప్రాజెక్ట్ కింద కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుచేయబోతున్నామని వెల్లడించారు. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ కోసం సామాన్యులు నిరీక్షించే పరిస్థితి లేకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునీకరిస్తున్నామని ప్రకటించారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, చాట్ బోట్స్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను రీ ఆర్గనైజేషన్ చేయాలని అధికారులకు సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులను ఎట్టిపరిస్థితులలోనూ సబ్ రిజిస్ట్రార్‌లు రిజిస్ట్రేషన్ చేయకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని , భూ భారతి తరహాలో ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేసి నిషేధిత ఆస్తుల వివరాలను అందులో పొందుపరచి రెవెన్యూశాఖకు అనుసంధానం చేయాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న గజం స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తులలో గజం భూమిని రిజిస్ట్రేషన్ చేసిన క్షణంలోనే తన కార్యాలయంతోపాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో డిస్ ప్లే అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. లక్షలాది కుటుంబాలకు మేలుచేసే ఎల్. ఆర్ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లా రిజిస్ట్రార్‌లు ప్రతిరోజు దీనిపై సమీక్షించాలని ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులపై ఏమైనా సందేహాలుంటే సబ్ రిజిస్ట్రార్లు ఉన్నతాధికారులతో మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకొని సమస్యను పరిష్కరించాలే తప్ప దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకూడదు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు రెండు మూడు సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్నారని వారి ఆవేదన అర్థం చేసుకొని నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు పరిష్కరించాలి. కానీ తప్పుచేసి ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేయవద్దని హితవు పలికారు. జిల్లా సబ్ రిజిస్ట్రార్లు ఆఫీసుకే పరిమితం కాకుండా ప్రతివారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించాలని ఆదేశించారు.

తొలి దళిత సాహిత్య ఉద్యమ కవి దున్న ఇద్దాసు

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి - కల్చరల్

సాహిత్యం,,సంస్కృతిని, సామాజిక సమైక్యత కోసం కృషి చేసిన మహనీయులలో అగ్రగణ్యుడు దున్న ఇద్దాసు అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛా న్స లర్, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. ఎందరో మహానుభావులు మధురస్మృతులలో భాగంగా తొలి దళిత కవి, తెలంగాణ వేమన దున్న ఇద్దాసు సంస్మరణ సభ సోమవారం శ్రీ త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ ఆచార్య బిరుదురాజు రామరాజు వంటి పరిశోధకులు ఇద్దాసును 'మాదిగ మహాయోగి'గా కీర్తించారని. సుంకిరెడ్డి నారాయణరెడ్డి వంటి చరిత్రకారులు, సాహిత్య చరిత్ర రచయితలు ఇద్దాసును 'తొలి దళిత కవి'గా గుర్తించారని అన్నారు. అచల యోగిగా, సంకీర్తనాకారుడిగా, తత్త్వకవిగా, ప్రసిద్ధుడైన దున్న ఇద్దాసు అట్టడుగు కులాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడు అని కీర్తించారు. కార్యక్రమంలో కళాపోషకులు వడ్లకొండ వెంకట్ రావు, నటులు జంగయ్య గౌడ్, గాన సభ కమిటీ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్‌లో ఏప్రిలియా ట్యూనో 457 ఆవిష్కరణ

హైదరాబాద్ : ఏప్రిలియా ట్యూనో 457ను ఆ కంపెనీ హైదరాబాద్ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూం ధరను రూ.3,96,005గా నిర్ణయించినట్లు ఆ కంపెనీ తెలిపింది. 457 సిసి ట్విన్ సిలిండర్ ఇంజిన్ కలిగిన దీనికి మూడేళ్ల వారంటీని అందిస్తున్నట్లు పేర్కొంది. రూ.10,000తో ముందస్తు బుకింగ్స్‌ను తెరుస్తున్నామని.. త్వరలోనే డెలివరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది.

అసంఘటితరంగ కార్మికుల హక్కుల సాధన సిఐటియుతో సాధ్యం

- రమేశ్‌బాబు సమక్షంలో చేరిక 250 మంది బార్ధాన్ కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసంఘటిత కార్మికులైన బార్ధాన్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని, వారి హక్కుల కోసం పోరాడుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు నూర్జహాన్, రమేశ్‌బాబు తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో 250 మంది బార్ధాన్ కార్మికులు సోమవారం సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా వారికి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అనుసరించే విధానాల వల్ల నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, పేద ప్రజలకు మాత్రం ఉపాధి అవకాశాలు లేక సరైన కూలి దొరకక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అన్నారు. మరోకవైపు కార్మికులకు కనీస వేతనాలు అమలు జరపటంలో, వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందటంతో పాటు యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఫలితంగా దశాబ్దాల తరబడి కనీస వేతనాల సవరణ అనేక రంగాల్లో జరగటం లేదని తెలిపారు. తమ హక్కుల సాధనకు కార్మికులు ఐక్యంగా పోరాడితేనే కొన్ని సమస్యలైనా పరిష్కారం అవుతున్నాయని స్పష్టంచేశారు. అసంఘటిత కార్మికులైన బార్ధాన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. అనంతరం కూలి రేట్ల పెంపుదల కొరకు యాజమాన్యాలు దిగిరావాలని, కార్మికులందరూ ఐక్యం వర్థల్లాలి అంటూ నినాదించారు. ఈ కార్యక్రమంలో బార్ధాన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాము, ప్రధాన కార్యదర్శి ఇమామ్, నాయకులు విజయ్, రాజు, గంగాధర్, భాస్కర్ తదితరులతో పాటు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిఐటియులో చేరిన బార్ధన్ కార్మికులు

మూత్రపిండ వ్యాధులపై అవగాహన

- మెడికవర్ హాస్పిటల్ బైకర్స్ ర్యాలీ

ప్రజాశక్తి - హైదరాబాద్

నిశ్శబ్దంగా ముంచుకొస్తున్న దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధిపై అవగాహన పెంచడానికి మెడికవర్ హాస్పిటల్స్ బైకర్స్ ర్యాలీని నిర్వహించింది. హార్లే డేవిడ్‌సన్ బైకర్స్‌తో కలిసి దీన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని ట్రాఫిక్ ఎసిపి సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, హార్లే ఓనర్స్ గ్రూప్, బంజారా చాప్టర్ సభ్యుల భాగస్వామ్యంతో కలిసి కిడ్నీ వ్యాధులపై అవగాహన పెంచేందుకు, ప్రజల్లో కిడ్నీ ఆరోగ్యంపై చైతన్యం కలిగించడానికి నిర్వహించడం చాలా అభినందించాల్సిన విషయమన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో డబ్బు కన్నా ఆరోగ్యం ఎంతో విలువైందని సత్యనారాయణ అన్నారు. దేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి వేగంగా విస్తరిస్తోందని మెడికవర్ హాస్పిటల్స్ నెఫ్రాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ కమల్ కిరణ్ పేర్కొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టి సాగర్

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీరు అందక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. హన్వాడ మండలంలోని పలు గ్రామాల్లో వరి, టమాట, వంకాయ, పశు గ్రాసం తదితర పంటలు సాగు చేయగా.. నీరందక వందల ఎకరాల్లో పైర్లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం ప్రతినిధి బృందం ఆయా ప్రాంతాల్లో పర్యటించి పంటలను పరిశీలించి.. రైతులతో మాట్లాడినట్టు చెప్పారు. యారోన్‌పల్లి, తిరుమలగిరి, మునిమోక్షం, అమ్మాపూర్, అంబటోనిపల్లి, కొనగట్టుపల్లి గ్రామాల్లో గతేడాది సాగు చేసిన విస్తీర్ణంలోనే ఈసారి కూడా వేసినట్టు రైతులు చెప్పారని అన్నారు. కానీ ఈ సంవత్సరం బోరు బావులు ఎండిపోయి నీరు అందించడం లేదన్నారు. సాగుకు ఎకరాకు 20వేల నుంచి 30 వేల రూపాయల వరకు ఖర్చు చేశామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. పెట్టుబడిలో సగం కూడా చేతికి వచ్చే పరిస్థితి లేదన్నారు. పంటలను పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ ఒక టీమ్‌ను ఏర్పాటు చేసి రైతుల వద్దకు పంపించాలని, ఎండిపోయిన వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటకు ఎకరాకు 50వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రాములు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కిల్లె గోపాల్, నాయకులు ఎ.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు రేవతి, తన్వి యాదవ్‌లకు బెయిల్ మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక మాధ్యమాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియోలు పోస్టు చేసిన వ్యవహారంలో అరెస్టు అయిన జర్నలిస్టు రేవతి, తన్వి యాదవ్‌కు బెయిల్ లభించింది. రూ.25 వేల పూచీకత్తుతో నాంపల్లి కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. ప్రతి సోమ, మంగళవారం విచారణకు హాజరుకావాలని కోర్టు వారిని ఆదేశించింది. 'నిప్పు కోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో సీఎంను తిడుతున్న వీడియో వైరల్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కైలాష్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పల్స్ టీవీకి చెందిన ఓ రిపోర్టర్ గుర్తు తెలియని వ్యక్తిని ఇంటర్వ్యూ చేశారు. అందులో మాట్లాడిన వ్యక్తి సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. పల్స్ టీవీ ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేయించిందని, పల్స్ టీవీలో వచ్చిన ఈ వీడియోను 'నిప్పుకోడి' అనే ఎక్స్ హ్యాండిల్‌లో ట్రోల్ చేసినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో తేలింది. కేసు దర్యాప్తు చేసి ఆ టీవీ ఛానల్ సీఈవో, జర్నలిస్ట్ రేవతితో పాటు పల్స్ టీవీ ప్రతినిధి బండి సంధ్య అలియాస్ తన్వి యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా వీరికి నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

బివి శ్రీనివాస్ రెడ్డి పిటిషన్ కొట్టివేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓబులాపురం మైనింగ్ కేసులో బివి శ్రీనివాస్‌రెడ్డి పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. ప్రస్తుతం ఈ కేసు సిబిఐ కోర్టులో విచారణ దశలో ఉన్నందున పిటిషన్‌పై విచారణ చేపట్టలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఓబులాపురం అక్రమ మైనింగ్‌పై 2009లో సిబిఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో గాలి జనార్దన్‌రెడ్డి, బివి శ్రీనివాస్‌రెడ్డి సహా పలువురిని అరెస్ట్ చేయగా.. ప్రస్తుతం వారు బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసులో భాగంగా ఓబులాపురం గనులను పరిశీలించిన సర్వే విభాగం అధికారి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నివేదిక ఇచ్చారు. గతేడాది జనవరిలో సిబిఐ కోర్టులో సర్వే విభాగం అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ కూడా చేశారు. అయితే, ఆ అధికారి తప్పుడు సమాచారం ఇచ్చారని ఆర్నెళ్ల తర్వాత సిబిఐ కోర్టులో బివి శ్రీనివాస్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఆయన్ను మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. బివి శ్రీనివాస్‌రెడ్డి పిటిషన్‌ను సీబీఐ కోర్టు కొట్టివేసింది. సిబిఐ కోర్టు ఉత్తర్వులను ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ కోర్టు ఓఎంసీ కేసును వేగంగా విచారిస్తోందని తెలిపింది. ఈ దశలో సాక్షిని మరోసారి క్రాస్ ఎగ్జామినేషన్ చేసేందుకు అవకాశం ఇవ్వలేమని స్పష్టం చేసింది. బివి శ్రీనివాస్‌రెడ్డి పిటిషన్‌లో సరైన కారణాలు కూడా పేర్కొనలేదని తెలిపింది.

బిసి రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి రిజర్వేషన్లకు సంబంధించి రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ ఆమోదం లభించింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును శాసనసభ ఆమోదించింది. దీని ద్వారా విద్య, ఉద్యోగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే, రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును సైతం శాసనసభ ఆమోదించింది. బిల్లులు ఆమోదం పొందిన అనంతరం అసెంబ్లీ మంగళవారానికి వాయిదా పడింది.

26న 'చలో అసెంబ్లీ'

- నాన్‌టీచింగ్ సిబ్బంది సమస్యల్ని పరిష్కరించాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న టైమ్ స్కేల్ డైలీవేజ్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ తదితర నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలనీ, రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (టియుఇడబ్ల్యుయు -సిఐటియు అనుబంధం) ప్రకటించింది. ఈ కార్యక్రమంలో నాన్‌టీచింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు టియుఇడబ్ల్యుయు రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె వెంకటేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మెట్టు రవి, వి నారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యను ప్రయివేటీకరిస్తున్నదనీ, అందులో భాగంగానే ఈ ఏడాది బడ్జెట్‌లో నిధుల కేటాయింపును తగ్గించిందని విమర్శించారు. ఉన్నత విద్యా రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు అనుకూలంగా యుజిసి నిబంధనలను సడలించిందని పేర్కొన్నారు. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మిక హక్కులను మోడీ సర్కారు హరిస్తున్నదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లుతున్నదనీ, దీనికి యూనివర్సిటీ నాన్‌టీచింగ్ సిబ్బంది కూడా బలవుతున్నారని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కొరవడుతున్నదనీ, పనిభారం పెరుగుతున్నదనీ తెలిపారు. యూనివర్సిటీల నాన్‌టీచింగ్ సిబ్బంది తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

కెపిహెచ్‌బిలో 'ఐస్‌బర్గ్' ఔట్‌లెట్ ఏర్పాటు

- ప్రారంభించిన మురళీ మోహన్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆర్గానిక్ క్రీమరీ అయిన ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ తన సేవలను విస్తరించింది. హైదరాబాద్‌లోని కెపిహెచ్‌బిలో రెండో ఔట్ లెట్‌ను ఏర్పాటు చేసింది. సోమవారం దీనిని సినీ నటుడు, నిర్మాత మాగంటి మురళీ మోహన్, సిబిఐ మాజీ జెడి వి.వి లక్ష్మీనారాయణ లాంచనంగా ప్రారంభించారు. ఐస్‌బర్గ్ ఆర్గానిక్ ఐస్ క్రీమ్స్ ఫౌండర్ సుహాస్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సంస్థ 2013 నుంచి ఆర్గానిక్ ఐస్ క్రీం ఇండస్ట్రీలో ఉంది.

మంటల్లో ఆడ శిశువు

- ఎన్‌టిఆర్ స్టేడియంలో దారుణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్‌టిఆర్ స్టేడియంలో పరిశీలిస్తున్న పోలీసులు

ఆడ శిశువును గుర్తుతెలియని దుండగులు తగులబెట్టారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టిఆర్ స్టేడియంలో సోమవారం జరిగింది. దోమలగూడ ఎసిపి రాఘ వేంద్ర, సిఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌టిఆర్ స్టేడియంలో చెత్త తరలించే వాహనాల పక్కన అప్పుడే పుట్టిన ఆడ శిశువుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను రంగంలోకి దింపారు. వారు ఆధారాలను సేకరించారు. బతికుండగానే శిశువును కాల్చేశారా..? మృతిచెందిన శిశువును ఇక్కడికి తీసుకొచ్చి తగులబెట్టారా..? అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వాధీనం చేస్తున్న ఫోన్లతో పోలీస్ అధికారులు

శంషాబాద్‌లో పట్టుబడ్డ ఐఫోన్ స్మగ్లర్లు

- ఐదుగురి మహిళల నుంచి 10 ఐఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల నుంచి ఖరీదైన మొబైల్ ఫోన్లను స్మగ్లింగ్ చేస్తూ ఐదుగురు మహిళలు పట్టుబడిన ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం జరిగింది. ఎయిర్‌పోర్టు అవుట్ పోస్ట్ ఎస్‌హెచ్ఓ జె.బాలరాజ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఆపరేషన్ జరిగింది. స్మగ్లింగ్‌కు సంబంధించిన వివరాలను శంషాబాద్ ఎసిపి కెఎస్ రావు మీడియాకు వెల్లడించారు. యుఎఇలోని రాస్‌అల్ ఖైమా నుంచి హైదరాబాద్ విమానాశ్రయానికి ఉదయం 7:30 గంటలకు ఐదుగురు మహిళలు చేరుకున్నారు. ముందస్తు విశ్వసనీయ సమాచారం మేరకు ఎయిర్‌పోర్టులోని ఎగ్జిట్ వద్ద పోలీసులు నిఘా ఉంచారు. అనుమానం ఉన్న ఐదు మంది మహిళలు రిజ్వానా బేగం, సబాఖన్నం, ఓమర్ బేగం, సురియా ఖన్నం, లహియా ఉన్నిసాలను అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో అత్యంత ఖరీదైన అయిన టాప్ మోడల్ 10 ఐఫోన్ 16 ప్రో మాక్స్ గోల్డ్ కలర్ మొబైల్స్‌ను గమనించి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించిన పోలీసులకు మొబైల్‌లకు సంబంధించిన ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నట్టు పోలీసులు ధ్రువీకరించారు. ఒక్కో మొబైల్ రూ.90 వేలకుపైగానే ఉంటుందని తెలుస్తోంది. నిందితులను అరెస్టు చేసి క్రైమ్ నెంబర్ 243/2025, 318 (ఏ) 112 (1) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఏసీపీ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓయులో ఆందోళనలు చేయొద్దంటూ సర్క్యులర్

- విసి నియంతృత్వ పోకడలపై విద్యార్థి సంఘాల జెఎసి ఆగ్రహం
- సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని డిమాండ్
- భారీ నిరసన ర్యాలీ, అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఓయు విసి జారీ చేసిన సర్క్యులర్‌ను వాపస్ తీసుకోవాలని విద్యార్థి సంఘాల జెఎసి డిమాండ్ చేసింది. లేనియెడల ప్రతిపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను, మేధావులను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించింది. హైదరాబాద్ ఓయూలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దంటూ ఇచ్చిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం లైబ్రరీ నుంచి ఆర్ట్స్ కాలేజ్ వరకు విద్యార్థులు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల గుండె ధైర్యం, పౌర సమాజానికి పెద్దదిక్కైన ఓయులో విద్యార్థి ఉద్యమాలను నిషేధించడం దుర్మార్గమన్నారు. తెలంగాణలో ప్రజా ప్రజాపాలన అందిస్తామని సిఎం పదే పదే ప్రకటిస్తూనే.. ఓయులో విద్యార్థి ఉద్యమాలను నిషేధించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఈ వివాదంపై తక్షణమే స్పందించి ఓయు ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగం ఇచ్చిన భావ ప్రకటనా స్వేచ్ఛను నిరాకరించిన నియంతలు కాలగర్భంలో కలిశారని గుర్తు చేశారు. జార్జిరెడ్డి పిడిఎస్‌యు నాయకులు ఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అవగాహన లేకుండా ఒయు విసి నిర్ణయాలు చేయడం తన అజ్ఞానాన్ని తెలుపుతున్నదన్నారు. ఓయూ అభివృద్ధి కోసం, నిధుల కోసం ఓయూ విద్యార్థి సంఘాల నేతలు, ప్రొఫెసర్లు ఉద్యమిస్తున్నారని తెలిపారు. విసి మాత్రం విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలి యూనివర్సిటీ అస్తిత్వానికి వ్యతిరేకంగా చెత్త నిర్ణయాలు రుద్దాలని చూస్తున్నారని విమర్శించారు. ఇసి ఐదు నెలల పాలనలో విద్యార్థులతో, విద్యార్థి సంఘాల నాయకులతో ఒక్క సమస్య మీదా చర్చించలేదని అన్నారు. దివ్యాంగులను అమానుషంగా అరెస్టు చేయించి, వారిపై కేసులు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒయు అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించి, విశ్వవిద్యాలయాల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు కోరుతుంటే.. దానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం విసిల ద్వారా ఇలాంటి అణచివేత చర్యలకు దిగుతుందా అనే సందేహాలు కలుగుతున్నాయన్నారు. అనంతరం లా కాలేజ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించడానికి వెళ్తున్న విద్యార్థులను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. విద్యార్థి నేతలను అంబర్‌పేట, నల్లకుంట పోలీస్ స్టేషన్లకు తరలించారు. అక్రమ అరెస్టులను విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. అరెస్టయిన వారిలో సుమంత్ (జార్జిరెడ్డి పిడిఎస్‌యు), జంగిలి దర్శన్ (డిబిఎస్‌ఎ), ఎల్ నాగరాజు (ఎంఎస్‌ఎఫ్-టిఎస్), అనిల్ (బిఆర్ఎస్‌వి), జార్జిరెడ్డి పిడిఎస్‌యు నాయకులు ఎం వెంకటేష్, ఎస్ అంజి, స్వాతి, కోటేశ్వర రావు, ప్రణిత, నవ్యశ్రీ, నవీన్ (ఎస్ఎస్‌యు), చేరాల వంశి (జెవిఎస్) ఉన్నారు.

ఇన్‌ఛార్జి మంత్రులు, ఎమ్మెల్యేల హక్కులు తేలాల్సిందే

- బిజెపి సభ్యులు కె వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాను 84 ప్రశ్నలను ఈ సభలో ఇస్తే కేవలం ఎనిమిదింటికే సమాధానాలు వచ్చాయనీ, 76 ప్రశ్నలకు సమాధానాలు లేవని బిజెపి సభ్యులు కె వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఆర్‌టిఐ ద్వారా 86 ప్రశ్నలను ఒక్కో డిపార్టుమెంట్ ఒక్కో విధంగా తనకు సమాధానాలు ఇచ్చిందని వివరించారు. నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జి మంత్రుల పాత్రేంటి? ఇన్‌ఛార్జి మంత్రి శాసనం ద్వారా నియమితులయ్యారా? పార్టీల బలోపేతం కోసం పెట్టుకున్నారా? ప్రతి దాంట్లో ఇన్‌ఛార్జి మంత్రుల జోక్యమేంటి? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. దీనిపైనా, ఎమ్మెల్యే హక్కులపైనా సభలో తేలాలని పట్టుబట్టారు.